క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన



రాజుపాలెం(నకరికల్లు): నకరికల్లు మండలంలోని నర్సింగపాడులో గల మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానంలో ఆరవ లక్ష బిల్వార్చన పూజా కార్యక్రమాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను విశేష అలంకరణలు చేశారు. కార్తిక మాసం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత గోమాత, గణపతి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం 30 మంది దంపతులతో సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. స్వామివారికి వివిధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ పూజా కార్యక్రమాలు నాలుగు రోజులపాటు నిర్వహిస్తామని దేవస్థానం ప్రధాన పూజారి పమిడిమర్రి శ్రీనివాసశర్మ తెలిపారు.

మానవ హక్కుల అవగాహన ర్యాలీ


రాజుపాలెం: మండలంలోని ఉప్పలపాడు ఎస్సీ కాలనీలో దళిత బహుజన రిసోర్స్ ఆధ్వర్యంలో మానవ హక్కుల దినోత్సవం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో డీబీఆర్‌సీ రిసోర్స్ పర్సన్ కోటిరత్నం మాట్లాడుతూ 1948లోనే మానవ హక్కుల దినోత్సవం ఏర్పాటు అయ్యిందని తెలిపారు. ప్రతీ ఒక్కరు మానవ హక్కుల గురించి తెలుసుకోవాలని తెలిపారు. మానవ హక్కులను తెలియజేస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, డ్వాక్రా గ్రూపుల యానిమేటర్స్ పాల్గొన్నారు.

ఘనంగా లూథరన్ చర్చి ప్రథమ వార్షికోత్సవం



విప్పర్ల(క్రోసూరు): మండల పరిధిలోని విప్పర్ల గ్రామంలోని లూథరన్ చర్చి ప్రథమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ బిషప్ సూర్యప్రకాష్ వాక్యసందేశం అందించారు. సత్తెనపల్లి ఫీల్డ్ ఛైర్మన్ రెవ.డా.ఎం.సుందరరావు మాట్లాడుతూ క్రైస్తవుల సేవల గురించి తెలియ జేశారు. లూథరన్ మిషన్ ద్వారా విద్య, వైద్య సామాజిక సేవలు అందించిన విషయం జ్ఞాపకం చేశారు. క్రైస్తవులు ప్రేమ, జాలి కలిగి ఉండాలని తెలిపారు. ప్రార్థనల నంతరం ప్రేమవిందు నిర్వహించారు. పాస్టర్ రెవ.రాజకుమార్, పాస్టర్ జాషువ, రాజు, డెలిగేట్ సభ్యుడు కిరణ్, సంఘ పెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు మృతి



రాజుపాలెం(నకరికల్లు): రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు మృతి చెందిన సంఘటన మండలంలోని చీమలమర్రి సమీపంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. నకరికల్లు మండలం చీమలమర్రి గ్రామానికి చెందిన పశుపులేటి కేశవులు(47) ఆదివారం నకరికల్లులో పని ముగించుకుని స్వగ్రామమైన చీమలమర్రికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. చీమలమర్రి సమీపంలో రోడ్డుకు మూల మలుపు ఉండడంతో మలుపు వద్ద ఇనుపరాడ్డులు బిగించి ఉండడంతో దిచక్ర వాహనంపై వెళుతున్న కేశవులు ఇనుప రాడ్డులు ఢీకొని రోడ్డుపై పడి, అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ బాలకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టర్ నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడు సుమారు 22 ఏళ్ల నుంచి ఒక దినపత్రికలో విలేకరిగా పనిచేస్తున్నాడు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆస్పత్రిలో ఉన్న బంధువులను పరామర్శించేందుకు వచ్చిన మహిళ అదృశ్యమైన ఘటనపై గవర్నర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం కోనంకి గ్రామానికి చెందిన తుమ్మ తిరుపతమ్మ తన అత్త అంజలితో కలిసి ఈ నెల 7న విజయవాడకు వచ్చింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తోడి కోడలిని చూసేందుకు పాత ప్రభుత్వాస్పత్రికి చేరుకున్నారు. ఇద్దరూ కలిసి ఆస్పత్రిలో ఉన్న రోగిని పరామర్శించి బయటకు వచ్చారు. అదేరోజు రాత్రి 9.30 గంటల సమయంలో ఆమె అత్త అంజలి ఆస్పత్రి బయట తెలిసిన వారితో మాట్లాడుతుంది. ఆ సమయంలో తిరుపతమ్మ అక్కడ నుంచి వెళ్లిపోయింది. ఆమె కోసం అంజలి వెతికినప్పటికీ ఆచూకీ తెలియలేదు. దీనిపై గవర్నర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా కార్తిక వనసమారాధనలు



కాపు వనసమారాధన నిర్వహించే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న మంత్రి అంబటి, నాయకులు

సత్తెనపల్లి: ఐక్యత ద్వారా అభివృద్ధి సాధించవచ్చునని మంగళగిరి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.శ్రీనివాసులు అన్నారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన విశ్వబ్రాహ్మణ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సభకు సంఘ గౌరవ అధ్యక్షుడు చింతాడ రమేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులు రాష్ట్రంలో 20 లక్షలకు పైగా ఉన్నారన్నారు. కులవృత్తులు చేస్తున్నప్పటికీ విశ్వబ్రాహ్మణులు ఆర్థికంగా ఎదగలేక పోయారన్నారు. తమ పిల్లలను ఉన్నత విద్యావంతులుగా చదివించాలని కోరారు. అందరూ ఐకమత్యంగా ఉండాలని అప్పుడు మాత్రమే రాజకీయ పార్టీలు గుర్తిస్తాయ న్నారు. రాజకీయంగా, ఆర్థికంగా బలంగా ఉన్నవారికే ప్రస్తుత సమాజంలో గుర్తింపు ఉందని, ప్రతి ఒక్కరూ ఆర్థికంగా ఎదగాలన్నారు. స్థానిక సంస్థలలో పోటీకి విశ్వబ్రాహ్మణులు సిద్ధం కావాలన్నారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులు కోటగిరి పోతులురయ్య, దాసు భాస్కరాచారి ఇతర కార్యవర్గ సభ్యులచేత శ్రీనివాసులు ప్రమాణం చేయించారు.

విశ్వబ్రాహ్మణ మహిళా సంఘ అధ్యక్షురాలిగా తిప్పర్తి మధులత ...

విశ్వబ్రాహ్మణ మహిళా సంఘం నూతన అధ్యక్షురాలిగా తిప్పర్తి మధులత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విశ్వబ్రాహ్మణ మహిళా సంఘం నూతన కార్యవర్గం ఆదివారం ఏర్పాటైంది. కార్యదర్శిగా మహంకాళి పార్వతి, కోశాధికారిగా వెలగలేటి శివఛాయ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా దాసు కల్పన, నెమలికొండ గోపిక, లకనవరపు ఉమామహేశ్వరి, కూరపాటి మహాలక్ష్మి, నూతలకంటి మహాలక్ష్మి, కార్యదర్శులుగా మహంకాళి దుర్గ, కల్లూరి మహేశ్వరి, సిద్దు శివకుమారీ, సుంకర భాగ్యలక్ష్మి, వంగిపురపు విజయలక్ష్మిలు ఎన్నికయ్యారు.

నేడు ఆర్యవైశ్య కార్తిక వన సమారాధన

అచ్చంపేట: మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మండలంలోని నీలేశ్వరపాలెంలో గల గిరిజా సమేత నీలకంఠేశ్వర స్వామి దేవాలయం వద్ద ఆర్యవైశ్య కార్తిక వనసమారాధన నిర్వహించనున్నట్లు సంఘం ప్రతినిధులు సూరే సుబ్బారావు, సూరే సాంబశివరావు ఆదివారం తెలిపారు. ఆర్యవైశ్య ప్రముఖులంతా తరలి రావలసినదిగా వారు కోరారు.

ముప్పాళ్లలో ఆర్యవైశ్య వనసమారాధన..

ముప్పాళ్ళ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధన కార్యక్రమం ఆదివారం జరిగింది. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు చల్లంచర్ల సాంబశివరావు పాల్గొని మాట్లాడారు. ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు దివ్వెల శ్రీనివాసరావు, కొత్తూరి విశ్వేశ్వరరావు, కొత్తా రామకృష్ణ, గాదంశెట్టి రామకృష్ణ, బొండా వెంకటేశ్వరరావు, అనుమాలశెట్టి శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, శ్రీరంగనాయకులు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అనుమాలశెట్టి శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సందడిగా బ్రాహ్మణ కార్తిక వనసమారాధన...

సత్తెనపల్లి: పట్టణంలోని నాగార్జుననగర్‌లో గల మహాకవి శ్రీశ్రీరోడ్డులోని సత్యధ్యాన మందిరం ఆవరణలో ఆదివారం సత్తెనపల్లి బ్రాహ్మణ సేవా సంఘం, సత్య ధ్యాన మందిర కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో 23వ కార్తిక వన సమారాధన ఆదివారం సందడిగా సాగింది. ముఖ్య అతిథిగా కరివేన సత్రం, ఏపీ బీఎస్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యదర్శి కోనూరు సతీష్ శర్మ, ఏపీ బీఎస్‌ఎస్‌ఎస్ ఉపాధ్యక్షుడు గణపవరపు రంగారావులు హాజరయ్యారు. సామూహిక గోపూజ, సామూహిక ఏకాదశ రుద్రాభిషేకం, దాత్రి పూజ నిర్వహించారు. అనంతరం డాక్టర్ గుండ్లపల్లి రామచంద్ర శేఖర్, డాక్టర్ గిరిజ దంపతులను సత్కరించారు. అలాగే ఉత్తమ లైబ్రేరియన్‌గా పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్‌చే ప్రశంసలు అందుకున్న కల్లూరి శేషశ్రీ ప్రసాద్, పూర్ణిమదేవి దంపతులను ఘనంగా సన్మానించారు. అనంతరం భోజనాలు నిర్వహించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి బ్రాహ్మణ సేవా సంఘం, సత్యధ్యాన మందిరం, బ్రాహ్మణ సంఘం నేతలు పాల్గొన్నారు.



స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులును సన్మానిస్తున్న దృశ్యం



సత్కారం అందుకుంటున్న డాక్టర్ గుండ్లపల్లి రామచంద్ర శేఖర్, డాక్టర్ గిరిజ దంపతులు

నేడు కాపు వనసమారాధన

రాజుపాలెం: మండలంలోని చౌటపాపాయపాలెం సమీపంలోని పరుచూరి స్కూల్ పక్కన మామిడి తోటలో సోమవారం కాపు వన సమారాధన జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆదివారం స్థలాన్ని పరిశీలించారన్నారు. ఈ వన సమారాధనలో కాపు వర్గీయులందరూ పాల్గొనాలని కోరారు.

నేడు నీలేశ్వరపాలెం సెల తిరునాళ్లు



స్వయంభూగా వెలసిన గిరిజా సమేత నీలకంఠేశ్వరస్వామి



దేవాలయ ముఖద్వారం

అచ్చంపేట: మండల కేంద్రమైన అచ్చంపేటకు కేవలం 5 కిలోమీటర్ల దూరంలో గల నీలశ్వరపాలెం గ్రామంలో రెండు కొండల మధ్యలో స్వయంభూగా వెలసిన గిరిజా సమేత నీలకంఠేశ్వర స్వామివారి తిరునాళ్ల మహోత్సవాలు సోమవారం జరగనున్నాయి. 18వ శతాబ్దంలో రాజా వాసిరెడ్డి వేంకటాద్రినాయుడు స్వయంభూగా వెలసిన స్వామివారికి ఆలయాన్ని నిర్మించినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. అప్పటి నుంచి ప్రతి యేటా కార్తిక మాసంలో వచ్చే చివరి సోమవారం తిరునాళ్ల నిర్వహిస్తూ వస్తున్నారు. నాలుగేళ్ల క్రితం స్వామివారి దేవాలయ ప్రాంగణాన్ని రజకసేవా సంఘం ఆధ్వర్యంలో అభివృద్ధి చేశారు. ఆవరణలో జ్యోతిర్లింగాలు, ఆరు అడుగుల నందీశ్వరుని విగ్రహాలను ప్రతిష్టించారు. భక్తులు పొంగళ్లు పొంగించుకునేందుకు ప్రత్యేకంగా షెడ్లు వేశారు. తిరునాళ్లకు మండలం నుంచే కాకుండా పలు ప్రాంతాలనుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు.

సెల తిరునాళ్లు పిలుపు ఇలా...

రెండు కొండలపై నుంచి స్వామివారి ఆలయ ప్రాంగణంలోకి జలధారలు సెలధారలు రావడం ప్రత్యేకత. అయితే ఆ సెలధారులు ఎక్కడినుంచి వస్తాయి, పైనుండి నీళ్లు ఎక్కడ ఉంటాయి అనేది అంతబట్టని ప్రశ్న. వర్షాలు పడినపుడు వర్షపునీరు నిల్వ ఉండి ధారలుగా వస్తాయని కొంత మంది చెబుతారు. స్వామివారి మహత్యం వల్లే జలధారులు స్వామివారి చెంతకు వస్తాయని మరి కొంత మంది చెబుతారు. అలా సెల ధారులు వస్తాయి కాబట్టే ఇక్కడ నిర్వహించే తిరునాళ్లను సెల తిరునాళ్లగా పిలుస్తుంటారు.

పటిష్టమైన బందోబస్తు..

తిరునాళ్ల మహోత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ మణికృష్ణ తెలిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు, పొంగళ్లు పొంగించుకునేందుకు, అన్నదాన సమారాధనలు చేసుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఎస్‌ఐ మణికృష్ణ తెలిపారు.

సత్తెమ్మతల్లి దర్శన టికెట్ ధరలు తగ్గింపు

నూతన కార్యవర్గ తొలిసమావేశంలో తీర్మానం



తొలి సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు కొరివి వెంకట నరేష్

అచ్చంపేట: మండలంలోని మాదిపాడు అడవిలో స్వయంభుగా వెలసిన సత్యంగల దేవతగా భక్తులు విశ్వసించే సత్తెమ్మతల్లి దర్శన టిక్కెట్ ధరలను తగ్గిస్తూ నూతన పాలకమండలి తొలిసమావేశంలో అధ్యక్షుడు కొరివి వెంకట నరేష్ ఆదేశాలు జారీ చేశారు. దేవాలయం ప్రాంగణంలో ఆదివారం కమిటీ అధ్యక్షుని అధ్యక్షతన తొలి సమావేశం నిర్వహించారు. మాదిపాడు మెయిన్ రోడ్డునుంచి సత్తెమ్మతల్లి దేవాలయం వరకు నూతనంగా వేసిన రోడ్డుకు ఇరువైపులా నీడనిచ్చే మొక్కలు నాటాలని, ప్రస్తుతం రూ.50గా ఉన్న దర్శన టికెట్ ధరను రూ.20కు తగ్గిస్తూ తీర్మానం చేశారు. అయితే గతంలో రూ.50టిక్కెట్‌పై దంపతులిరువురిని అనుమతించేవారు. ఇకపై రూ.20 టిక్కెట్‌పై ఒక్కరిని మాత్రమే అనుమతించనున్నారు. కమిటీ నూతన అధ్యక్షుడిగా కొరివి వెంకటనరేష్ బాధ్యతలు చేపట్టిన నిర్వహించిన మొదటి సమావేశంలో పలు మార్పులు, చేర్పులు చేశారు. ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు, ఆలయం వద్ద ఏకోపాక్కు నిర్మాణానికి తొలివిడతగా రూ.62లక్షలు మంజూరు చేయించిన స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరావుకు నూతన కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. దేవదాయశాఖ ఈఓ కోటిరెడ్డి, ఆలయ పూజారి మేడేపల్లి అప్పయ్యశాస్త్రి, సర్పంచ్ మాదా వెంకట్రావు, ఈశ్వరమ్మ దంపతులు, దేవరశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమస్య పరిష్కారానికి కృషిచేసిన అందరికీ ధన్యవాదాలు



మాట్లాడుతున్న అధ్యక్షుడు బొడ్డు రామారావు, పక్కన వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రతాపరెడ్డి

సత్తెనపల్లి: ఏపీ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ బిల్డింగ్‌లో అద్దెకుంటున్న పయనీర్ ఆటోమొబైల్ షాపును శనివారం ఉదయం మాజీ శాసనసభ్యుడు యర్రం వెంకటేశ్వర రెడ్డి, ప్రజా సంఘాలకు చెందిన నాయకులు గద్దె చలమయ్య, దాసరి జ్ఞాన్‌రాజ్‌పాల్, దావులూరి కోటేశ్వరరావు, జుపల్లి పాల్, జిల్లెళ్ళ పాల్‌రాజ్, తదితరుల సమక్షంలో ఖాళీ చేయించిన సంగతి తెలిసినదేనని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డు రామారావు అన్నారు. ఆదివారం పెన్షనర్స్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. గదులు ఖాళీ చేయించే విషయంలో పెన్షనర్ల సమస్యను పరిష్కరించడానికి మొదటి నుంచి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబులు పూర్తి మద్దతు అందించారన్నారు. గదులను ఖాళీ చేసే విషయంలో వారందించిన సహాయ, సహకారాలు మరువలేనివన్నారు. కానీ ఒక దినపత్రికలో స్థానిక మంత్రి అంబటి రాంబాబు, అధికారులు ఈ సమస్య విషయంలో పట్టించుకోలేదని భావన కలిగేటట్లుగా రాయడం జరిగిందని, అది అవాస్తవమని ఖండించారు. పెన్షనర్స్ గదులు ఖాళీ చేయించటంలో చొరవ చూపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో పెన్షనర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు యేరువ ప్రతాపరెడ్డి, నాయకులు జట్టి సైదులు, శృంగారం, జక్కుల లక్ష్మీనారాయణ, కేబీఆర్‌జే ప్రసాద్, జగన్నాథ నాయుడు, రంగారెడ్డి, పొత్తూరి రామకోటయ్య, ఖాదర్ వలీ, ఇబ్రహీం, చంద్రయ్య, రొంపిచర్ల పురుషోత్తం, నాసరయ్య ఉన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

అమరావతి: గుంటూరు–1 డిపో పరిధిలోని అమరావతి, క్రోసూరు రూట్‌లలో ప్రయాణించే ప్రయాణికులు, ఉద్యోగులు, విద్యార్థులు ఆర్టీసీ పనితీరుపై సలహాలు, సూచనలు ఇవ్వాలని గుంటూరు–1 డిపో మేనేజర్ ఎంవీఎస్ రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం 'డయల్ యువర్ గుంటూరు–1డిపో మేనేజర్ కార్యక్రమంలో భాగంగా ఈరెండు రూట్లలో బస్‌వేళల్లో మార్పులు, అదనపు బస్ ట్రిప్‌ల కోసం, అలాగే సిబ్బంది ప్రవర్తనపై ప్రయాణికులు, ఉద్యోగులు, విద్యార్థులు తమ అభిప్రాయాలను సలహాలను తెలియజేసేందుకు ఈకార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. సోమవారం ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు 9989225420 నంబరుకు ఫోన్ చేసి తమ సలహాలు ఇవ్వాలని కోరారు.

ఎస్టీయూ మండల నూతన కార్యవర్గం

ముప్పాళ్ళ: ఎస్టీయూ మండల అధ్యక్షుడిగా పి.రామారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సత్తెనపల్లిలోని జరిగిన ఎస్టీయూ కార్యవర్గ సమావేశంలో మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి.రామారావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.కె.నూరుల్లా, గౌరవ అధ్యక్షుడిగా టి.అచ్చయ్య, ఆర్థిక కార్యదర్శిగా పి.వెంకట్రావు, మహిళా కార్యదర్శిగా బి.ప్రవీణకుమారి, జిల్లా కౌన్సిలర్లుగా ఎస్కే జాకీర్ హుస్సేన్, జి.రాధాకృష్ణ, ఎ.చంద్రశేఖర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమ వంతు పనిచేస్తామని వారు తెలిపారు.

పేదల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ కృషి

పిడుగురాళ్ల: రాష్ట్రంలోని పేదల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జైలాబ్దిన్ అన్నారు. పట్టణంలోని 25వ వార్డులో వైఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీతోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధి జరుగుతుందని, మహిళలు కూడా అన్ని విధాలుగా లబ్ధి పొందగలుగుతున్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పంచాక్షరినామ పారాయణ



ఆలయంలో పంచాక్షరి నామసంకీర్తన పారాయణ చేస్తున్న బయ్యవరం భక్తబృందం

అచ్చంపేట: మండలంలోని వేల్పూరులోని రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో కార్తికమాస ముగింపు ఉత్సవాలలో భాగంగా ఆదివారం పంచాక్షరి నామసంకీర్తన పారాయణ నిర్వహించారు. 18వ శతాబ్దంలో రాజావాసిరెడ్డి వెంకటాద్రినాయుడు కాలంలో ఈ దేవాలయం ప్రతిష్టితమైంది. స్వామివారిని సత్యంగల దేవుడిగా ఈ ప్రాంతవాసులు కొలుస్తారు. బయ్యవరం గ్రామానికి చెందిన యర్రంశెట్టి శ్రీనివాసరావు, సత్యవతి దంపతులచే అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బయ్యవరం గ్రామ భజన బృందం వారిచే ఉదయం 10 గంటలనుంచి రాత్రి 10గంటల వరకు నిర్విరామంగా 12 గంటలపాటు ఓంనమఃశివాయః అనే పంచాక్షరి నామ సంకీర్తన పారాయణాన్ని రాకయుక్తంగా ఆలపించారు. గ్రామానికి చెందిన పొన్నెకంటి గంగయ్య, నరసింహారావుల పర్యవేక్షణలో పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆడుదాం ఆంధ్రాకు నిధులు పెంచాలి

డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయ రాజు

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిచే ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం చాలా మంచి కార్యక్రమమని, అయితే కేటాయించిన నిధులు మరింత పెంచాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయరాజు అన్నారు. పట్టణంలోని పుతుంబాక వెంకటపతి భవన్‌లో ఆదివారం నిర్వహించిన భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) జిల్లా కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశానికి డీవైఎఫ్ఐ నాయకురాలు తులసి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఆంజనేయరాజు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో శాశ్వత ప్రాతిపాదికన క్రీడా ప్రాంగణాలు నిర్మించాలన్నారు. గత కార్య క్రమాల సమీక్షతో పాటు భవిష్యత్తు కార్యక్రమాలపై చర్చించారు. జిల్లా అధ్యక్షుడు వంగర తులసి, సహాయ కార్యదర్శి రాజ్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

13 నుంచి సామూహిక శ్రీమద్భగవద్గీత ఆరాధనలు

అమరావతి: మండల పరిధిలోని వైకుంఠపురం భగవాన్ శ్రీ వేదవ్యాస సనాతన ధర్మక్షేత్రంలో ఈనెల 13వతేదీ నుంచి నెల రోజుల పాటు సామూహికంగా శ్రీమద్భగవద్గీత ఆరాధనలు నిర్వహిసున్నట్లు వేదవ్యాసాలయం ప్రతినిధులు సుభాషిణి, సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పుణ్య మార్గశిర మాసాన్ని పురస్కరించుకుని సామూహికంగా శ్రీమద్భగవద్గీత ఆరాధనలు ప్రతిరోజూ రెండు బ్యాచ్‌లుగా ఉదయం 9 గంటలకు ఒకసారి, మళ్లీ మధ్యాహ్నం 2.30 గంటలకి రెండవసారి నిర్వహిస్తామన్నారు. ప్రపంచంలోనే అతి పెద్దదైన భగవాన్ శ్రీ వేదవ్యాస సనాతన ధర్మక్షేత్రంలో పరమ పవిత్రమైన మార్గశిర మాసంలో అష్టోత్తర శతనామాలతో సాక్షాత్తూ భగవత్స్వరూపమైన శ్రీమద్భగవద్గీత ఆరాధించుకునేందుకు భక్తులు వచ్చి పాల్గొనే అవకాశం కల్పిస్తామన్నారు. ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొనదలచిన భక్తులు 9949688136, 8886776180 నెంబర్లలో సంప్రదించి పేర్లను నమోదు చేయించుకోవాలని కోరారు

కార్డ్స్ సంస్థ సేవలు అభినందనీయం



బాలబాట డీఓలతో సంస్థ సభ్యులు

మాచర్ల: సమాజంలో ఉన్న అసమానతలను రూపుమాపేందుకు విద్య అవసరమని కార్డ్స్ సంస్థ పల్నాడులో చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని మాచర్ల మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు అన్నారు. కార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం మాచర్ల పట్టణంలోని పీడబ్ల్యూడీ కాలనీలో ఏర్పాటుచేసిన బాలబాట ఆర్గనైజర్ల సమావేశానికి ముఖ్య అతిథిగా మాచర్ల చిన ఏసోబు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి కార్డ్స్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ తాళ్లూరి అమర్నాథ్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఏడువేల బాలబాటల ద్వారా విద్యాభివృద్ధి కోసం కృషి చేస్తున్నామని అన్నారు. ఈసందర్భంగా దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుక్కమూడి ప్రసాద్ మాట్లాడుతూ వివక్షత లేని మానవ సమాజాన్ని నిర్మించడమే అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థ ముఖ్య ఉద్దేశం అన్నారు. దళితులు, పేద పిల్లలకు కార్డ్స్ సంస్థ అందిస్తున్న సేవా కార్యక్రమాలు ఎనలేనివన్నారు. దళిత బహుజన భీమ్‌సేన రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు జార్జి, పాస్టర్స్ కడియం అన్నారావు, కుక్కమూడి యాకోబు, జొన్నలగడ్డ ఏసుదాసు, బాలబాట ఆర్‌సీఓ పేరుపోగు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం బాలబాట కార్డ్స్ సంస్థ చైర్మన్ ఫ్రాంక్ విశ్వనాథం పుట్టినరోజు సందర్భంగా పుట్టిన రోజు కేక్ కట్ చేసి ఆయన దళిత సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం 30 మంది బాలబాట డీఓలకు మున్సిపల్ చైర్మన్ చేతుల మీదుగా దుస్తులు పంపిణీ చేశారు.

సురక్షిత నీరు అందించేందుకు చర్యలు చేపట్టాలి

ఊటుకూరు(క్రోసూరు): ఊటుకూరు సీపీడబ్ల్యూఎస్ స్కీం ఫిల్టర్ బెడ్‌లో ఇసుక నింపి స్వచ్ఛమైన తాగునీటిని అందించడానికి అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి రవిబాబు అన్నారు. గత రెండు రోజులుగా ఈ స్కీం ద్వారా వస్తున్న తాగునీరు పచ్చని రంగుతో, కలుషితంగా సరఫరా అవుతుండడంతో అచ్చంపేట మండలం కస్తలలో ఉన్న స్కీం ఫిల్టర్ బెడ్లను సీపీఎం ప్రతినిధి బృందం ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ ఫిల్టర్ బెడ్‌లో ఉండాల్సినంత ఇసుక లేకపోవడం వల్లనే రంగు మారిన కలుషితంగా ఉన్న తాగునీరు సరఫరా అవుతుందని తెలిపారు. రంగు మారిన కలుషితంగా ఉన్నటువంటి నీరు రావటానికి అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన అన్నారు. గత పది సంవత్సరాల నుంచి ఫిల్టర్ బెడ్లు ఇసుకతో నింపక పోయినా అధికారులు చూస్తూ ఉండటం దుర్మార్గమని అన్నారు. ఇప్పటికైనా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వెంటనే ఫిల్టర్ బెడ్‌లలో ఇసుకను నింపి స్వచ్ఛమైన తాగునీటిని అందించడానికి తీసుకోవాలన్నారు. సీపీఎం మండల కార్యదర్శి టి.హనుమంతరావు, ఊటుకూరు గ్రామ కార్యదర్శి గంజిమాల మధుసూదనరావు తదితరులు ఉన్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్‌నాయక్‌ను వివరణ కోరగా ఇసుక నింపాల్సిన మాట వాస్తవమేనని, జలజీవన్ మిషన్ పథకంలో దీనికి సంబంధించి అంచనాలు వేసామన్నారు. టెండర్ పనులు జరుగుతున్నాయని, త్వరలో ఇసుక మార్చటం జరుగుతుందన్నారు.

మానవ హక్కులపై అవగాహన



చిన్నారులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న శిఖా శ్యాంసన్

క్రోసూరు: మానవ హక్కులు రెండు రకాలని ఒకటి జన్మతః లభించేవి కాగా, రెండవది రాజ్యాంగపరంగా లభించేవని, జీవించే హక్కు జన్మతః లభించేది అని మిగతావన్నీ రాజ్యాంగపరంగా లభించేవని శ్యాం మిత్ర మండలి గౌరవ అధ్యక్షుడు శిఖా శ్యాంసన్ ఆదివారం అన్నారు. ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం పురస్కరించుకొని క్రోసూరు ఎస్టీ కాలనీలోని విద్యార్థులకు, ప్రజలకు మానవ హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శిఖా శాంసన్ మాట్లాడుతూ మానవ హక్కులను ఎవరైనా ఉల్లంఘించి ఇబ్బందులు గురిచేసినప్పుడు బాధితులు ప్రత్యేక కోర్టులు, మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించవచ్చని పేర్కొన్నారు. అనంతరం పిల్లలకు పెద్దలకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. శ్యామ్ మిత్ర మండలి కార్యదర్శి జానీబాషా, మిత్ర మండలి ఉపాధ్యక్షుడు ఊటుకూరి సలోమాన్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి

సత్తెనపల్లి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు జిల్లెల్ల పాల్ రాజ్ డిమాండ్ చేశారు. పొన్నూరులో అంబేడ్కర్ విగ్రహం ఎక్కి బట్టలు లేకుండా ఆయన్ను అవమానించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని కోరుతూ పట్టణంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ రాజ్యాంగంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రిజర్వేషన్ అమలు చేయడాన్ని కొన్ని వర్గాలవారు సహించలేకపోతున్నారన్నారు. ఈ నేపథ్యంలో వాళ్లు అనేక రకాలుగా అంబేడ్కర్‌ని అవమానిస్తున్నారన్నారు. ఈ దేశంలో అంబేడ్కర్‌తో పాటు మిగిలిన జాతీయ నాయకుల విగ్రహాలను అవమానిస్తే కఠిన శిక్ష పడే చట్టాన్ని పార్లమెంట్‌లో ఆమోదించాలన్నారు. అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానించిన వ్యక్తిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలన్నారు. సమావేశంలో బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు కుక్క మల్ల దేవానంద, తలతోటి కోటేశ్వరరావు, అంబేడ్కర్ ప్రజా సంఘం నాయకులు దావులూరి కోటేశ్వరరావు, గంగోలు రమేష్‌బాబు, నల్లూరి.రవి, ఏకుల రాజు, నందిగం చిట్టిబాబు, తదితరులు ఉన్నారు.